

కథా కౌముది

# అమ్మాయి మనసు

ఎ.అన్నపూర్ణ

అరవింద ఒక కార్పొరేట్ కంపెనీలో జాబ్ చేస్తోంది.27 ఏళ్ళు పెళ్లి చేసుకునే వయసు . తల్లి తండ్రులు రేవతి –భార్గవ్ లకు ఈమె ఒక్కతే కూతురు.

ఎప్పుడు ఎవరు అరవిందతో ఇంటికి వచ్చినా రేవతి ఆతురతఁగా వాళ్ళ గురించి వివరాలు అడుగుతుంది.

అరవింద విసుక్కుంది...తల్లిని.

"మామ్ , నువ్వేమిటి ఎదో పాతకాలం మనిషిలా వాళ్ళగురించి ప్రొఫైల్స్ అడుగుతావూ?" అని.

"నా ఆశ నాది.అడుగుతే ఏమైంది?" అంది రేవతి.

"నాకు నచ్చవు ఇలాంటివి.. ఇకనుంచి ఇంటికి పిలవను."అనేసింది.

"అలాటిపని చేయకు. వాళ్ళు వచ్చినరోజే ఐనా నాకు ఇంట్లో సందడి. లేకపోతె ఎవరిదారిన వాళ్ళం మెషీన్లలా ఉంటాం.ఓ మాటా లేదు పలకరింపులు లేవు నవ్వుతూ కబుర్లు చెప్పుకోడం ఉండదు. ఉండేది ముగ్గురమూ! చెరో టైముకి ఇంటికి చేరి నిద్రపోతాం."అంది రేవతి.

"మనం ఏమైనా చిన్నవాళ్లమా!ఇలాకాకపోతే రోజూ కబుర్లు విశేషాలు ఏమి ఉంటాయి?" అంది అరవింద.

"అదే నేను కోరుకునేది.ఇంట్లో పిల్లల సందడి ఉండాలి. ఆటలు పాటలు ఉరుకులు పరుగులు శబ్దాలు హడావిడి ఉంటేనే బాగుంటుంది. ఎక్కడా సందడిలేదు. అంటా సైలెన్స్. డిసిప్లిన్. సర్దుదామన్నా ఎక్కడివస్తువు అక్కడేవుంటుంది. ఆధునిక యంత్రాలు వచ్చాక వంట–పని కూడా నిముషాల్లో అయిపోతోంది. అసలు మనం ముగ్గురమూ కలిసి భోజనం చేసి ఎంతకాలమో ఐపోయింది. నువ్వేమో బయట తిన్నాను. ..అంటావు. డాడీ లంచ్ హెవీ అయిపొయిన్ది అంటారు. నేనేమో లంచ్ చేయను. కనుక ఎర్లీగా డిన్నర్ చేసేస్తాను. వీకెండ్ ఫ్రెండ్స్ తో బయటే ఉంటావు. డాడీ ఏడాదిలో ఆరునెలలు ఫారెన్ టూర్ లో వుంటారు. అయామ్ ఎలోన్...." అంటూ దిగులుగా చెప్పింది.

"మమ్మీ రోజూ ఏమి కబుర్లు విశేషాలు ఉంటాయి చెప్పు. ఎప్పటినుంచో ఈ లైఫ్ కి అలవాటు పడిపోయాము."

''అందుకే మనం మారాలి. ముఖ్యంగా నువ్వు మారాలి. పెళ్లిగురించి ఆలోచించు. నాకు అల్లుడిని తీసుకురా!''

''ఆన్లైన్ ఆర్డర్ చేసేయి. ''అంది కూతురు కూల్గా.

''ఇదేమి వేళాకోళంకాదు.సీరియస్ మ్యాటర్. యూ నో?''

''ఓ...మమ్మి . ఈ రోజు నీకు ఏమైంది?''

''నాకు పిచ్చి పట్టింది. అయినా మా గురించి ఆలోచించవేం? మా ముచ్చట తీరవద్దా? నీకుమాత్రం భర్తా పిల్లలు సంసారం సంతోషం ఉండాలిగా . ఎంతసేపు కంపెనీ బాగు కోసం కష్టపడటమేనా?

తాతగారు– నాన్నమ్మని రమ్మంటే వాళ్ళు విలేజిలో ఆస్తులు వదిలి రాము అంటారు. ఓ మై గాడ్ . ఇదేమి లైఫ్?అంటూ బాధపడింది.

''ఇప్పుడు కొత్తగా ఏమిటమ్మా ఇదీ ..... ఎప్పుడూ వుండేదేకదా!'' అంది అరవింద లైట్గా తీసుకుంటూ.

''కాదు.ఇదికాదు. నాకు మార్పుకావాలి. నీకూకావాలి.అది నాకు అల్లుడు వచ్చినపుడు జరుగుతుంది. ఆర్గ్యూ చేయకు. నువ్వు పెళ్లి చేసుకోవాలి. ఇప్పటికి ఆలస్యం ఐపోయింది..ఏదో ఒకరోజు తీసుకువచ్చి 'ఇదిగో నాకు నచ్చినవాడు....' అంటావని ఎదురుచూశాను. వచ్చినవాడు టీ తాగి వెడుతున్నాడేకానీ...నేను కోరుకున్నట్టు అల్లుడుగా ఉండటంలేదు.'' అరవింద పకపకా నవ్వింది.

ఆనవ్వుకి తెల్లనైన ఆమె వదనం గులాబిరంగులో మెరిసింది.

''ఎందుకు నవ్వుతావు! నీకు హేళనగా ఉందా?

''కాదు మమ్మి ...నాకు ఎందరో పరిచయస్తులు వున్నారు. కానీ వాళ్ళు లైఫ్ పార్టనర్ అనేటంత దగ్గిరగా రాలేదు.వాట్ కాన్ ఐ డూ? ''

''అంటే నీకు ఎలాంటి వాడు కావాలో నీకు తెలియడంలేదు.''

''అవును. ఈ రోజు డేటింగ్ ఆరునెల్లకి బ్రేకప్. లవ్ మ్యారేజ్ చేసుకున్నారు అంటారు.ఆతర్వాత డబ్బు కోసం టార్చర్ పెట్టేడు అనో మరో అమ్మాయితో అఫైర్ అంటారు. చదువు వుద్యోగం డబ్బు ఉంటుంది. కానీ ఇద్దరిమధ్యా ఏవో అసంతృప్తి.సూసైడ్ అటెమ్ట్ చేయడం. భార్య భర్తని మర్డర్ చేస్తుంది.భర్త భార్యని ఉరితీస్తాడు. నాకు ఎవరిని నమ్మాలో తెలియడంలేదు లేదు. అసలు పెళ్లి అంటే ఏమిటి ఎందుకు? అవసరమా ఇప్పుడు నాకు బాగానే వుందికదా !''

కూతురిమాటలకు రేవతి నిర్ఘాంతపోయింది.

''అరవిందా ..ఎవరికో ఏదో జరగడంలో చాలా కారణాలు ఉంటాయి. ఆరకమైనా కుటుంబాలు వేరు. ఇద్దరిలోను ఏవో లోపాలు కావచ్చు. వాళ్ళు పెరిగిన వాతావరణం వేరుగా ఉండవచ్చు. మనకు అలా జరిగే అవకాశం లేదు. నీకు ఒక ఏడాది టైము ఇస్తున్నాను. ఈ లోగా సెలక్ట్ చేసుకో. లేదంటే ఇక పెళ్లి గురించి నేను నిన్ను వేధించను. ''అంది రేవతి...లేచి వెళ్ళిపోతూ సీరియస్సగా.

రెండు రోజుల తర్వాత భార్గవ– రేవతి వాళ్ళ తల్లి తండ్రులను చూడటానికి వెళ్ళేరు.

మీనాక్షి–సుందర్రావు అమలాపురంలో వూళ్ళో కొబ్బరితోటలో మేడ కట్టుకుని వుంటున్నారు. పదిమంది పనివాళ్ళు పాడి పంటలు పచ్చని ప్రకృతిలో హాయిగా వున్నారు.

రేవతి భార్గవాలను ''పెళ్లిరోజు ఇక్కడ చేసుకోండి ఈ ఏడూ ...''అని పిలిచారు.

పెద్దవాళ్ళకి మాట మీద గౌరవంతో వాళ్ళతో గడపటానికి వెళ్ళేరు. ఈ విషయం అరవిందకి చెప్పలేదు. వూరికే కొద్దిరోజులు వాళ్ళతో ఉంటాము...అని చెప్పేరు.

' ఎప్పుడూ మీ వృత్తికే అంకితం ఐపోతే విశ్రాంతి ఎక్కడ! అంటూ పార్టీ ఆరెంజ్ చేసి సంతోషంగా గడిపారు.

మొదటిసారి ఒంటరిగా వుంది అరవింద. ఆమెకి బోర్ అనిపించి ...మమ్మీది–తనది వార్డ్ రోబ్ సర్దడం మొదలు పెట్టింది.

ఊహతెలిసినప్పటి స్కూల్ రోజులు కాలేజీ చదువు స్నేహితులు భార్గవను పెళ్ళిచూపులకు వచ్చినపుడు ఒకరిని ఒకరు అర్ధం చేసుకోడానికి ప్రతిరోజూ ఆరునెలలు బయటకు పంపడం అదీ సాయంత్రానికి ఇంట్లో ఉండాలి అనే కండిషన్తో అవకాశం ఇవ్వడం చివరికి పెళ్లి చేయడం అన్ని మనసువిప్పి చెప్పుకుంది.

రేవతి డైరీ , ఫోటో ఆల్బమ్, కొన్ని గిఫ్టులు కనిపించాయి. డైరీ చదివింది. అందులో భర్త గురించిన విషయాలు అతడితో తిరిగిన ప్రదేశాలను అనుభూతులను రాసుకుంది. అత్తమామలు చూపించు ప్రేమగురించి రాసుకుంది.

తల్లి కాబోతున్న ఆనందాన్ని రాసుకుంది. అరవింద పుట్టేక పెంపకం, పెరిగి పెద్ద అవుతున్న రోజులనాటి విషయాలు ఆమె మీద పెట్టుకున్న ఆశలు...ఏమిటో రాసుకుంది.

ఇక ఆల్బమ్ లో కాలేజీ స్నేహితులతో ఫోటోలు తర్వాత వాళ్ళ పెళ్లిళ్లు అయ్యాక పిల్లలు పెద్దవాళ్ళు అయ్యాక ఫామిలీ పిక్చర్స్ ఇప్పటికీ కొనసాగిస్తున్న స్నేహాలు..అరవిందకి అమ్మగురించిన సంగతులు ఎన్నో తెలిసాయి.

వెంటనే ఫోనుచేసింది.

''వాట్ మమ్మీ ఇన్ని రోజులు ఏమిచేస్తున్నారు... త్వరగా రండి నాకు బోరుగా వుంది. ఐ మిస్ యు మామ్ ...

అంది గారాలుపోతూ .

''ఆ వచ్చేస్తున్నాం ట్రైన్లో వున్నాం. రోజూ ఫోను చేసి మాటాడుకుంటూనే వున్నాం కదమ్మా!" అంది రేవతి ప్రేమగా.

వాళ్ళకీ కూతురిని వదిలి వెళ్లడం బాధ కలిగింది.

''ఏమో నాకు తెలియదు. నీతో చాలా మాటాడాలని వుంది.''

అంటూ కాసేపు తండ్రితోనూ మాటాడింది.

వందే భారత్ ట్రయిన్లో సాయంత్రం ఇంటికి వచ్చారు.

రేవతి భార్గవ రెస్టు తీసుకున్నాక. ...'

“మమ్మి నేను నీ రూములో ఉంటా ఈరోజు'' అంది.

అలాగే ... డిన్నర్ చేసాక రేవతి–అరవింద బెడ్ రూమ్ లోకి వెళ్ళేరు.

''మమ్మి మీరు తాతగారి వూళ్ళో ఎలా టైంపాస్ చేశారు?” అమ్మ వొడిలో తలపెట్టుకుని పడుకుని అడిగింది అరవింద.

''అక్కడ తాతగారు గెట్ టుగెదర్ ఆరెంజ్ చేశారు.. ఆవూరిలో నేను చదివిన కాలేజి ఫ్రెండ్స్ కూడా వచ్చారు. ఇవిగో ఫోటోలు ''అంటూ ఫోనులో చూపించింది.

''wow చాలా బాగున్నాయి.ఈ సారి నేను కూడా వెడతాను....మమ్మి ఐ యాం సారీ ! నీ బీరువా సర్దుదామని నీ పర్మిషన్ లేకుండా ఓపెన్ చేసాను. ''

''అంతేకదా! నీకు ఆ హక్కు ఉందిలే. సో వాట్?''

''నీ డైరీ చదివాను.....!''

''ఒకే ,నో ప్రాబ్లెమ్.''

''అన్ని చూసేసాను ..... ''

కాసేపు ఆలోచించింది రేవతి. ఆమె పర్సనల్ గిఫ్ట్స్ ఇంకా ఏమున్నాయి...అని గుర్తు చేసుకుంది. పర్వాలేదు. ఇప్పుడు అరవిందకి తెలిసినా పర్వాలేదు. ఆమెలో మార్పు రావచ్చు....అనుకుంది.

''ఏమని అనుకున్నావు? ''

''నేను నీ గురించి తెలుసుకోవాలని ఎందుకు అనుకోలేదు? అసలు ఇలాంటివి నాకు ఎందుకు తోచలేదు? గతంలో మమ్మి –డాడీ ,ఇప్పుడు నాకు ఇలాంటి అనుభవాలు కావాలి అని తెలుసుకోలేకపోయాను ...........అనిపించింది.''

''నీకే కాదు ఈ తరం మాలాగా ఆలోచిస్తే బాగుంటుంది.కానీ కాలం మారింది. డేటింగ్... బాయ్ ఫ్రెండ్ ..ఫ్రీడమ్... ఇంకా ఏవేవో విదేశీ పద్ధతులు పాటిస్తున్నారు. మన సాంప్రదాయ పద్ధతులు ఎవరికీ నచ్చవు.ఓల్డ్ ఫ్యాషన్ అంటారు. సాంప్రదాయంలో మోరల్ వాల్యూస్ ఉంటాయి, అని చెబితే ఎవరికీ నచ్చవు. మీరేతెలుసుకోవాలి''

''ఎస్స్ మమ్మి ....నాకు ఇప్పుడు తెలిసింది. పెళ్లి చేసుకోవాలంటే నాకు నిశ్చయమైన అభిప్రాయం ఏర్పడింది. ఐ టెల్ యు సూన్.''అంటూ మమ్మీతో ఎన్నో విషయాలు పంచుకుంది.

కొద్దిరోజులు తర్వాత రేవతి తన ఫ్రెండ్స్ భార్గవ ఫ్రెండ్స్ కొడుకులను పిలిచి పార్టీ ఇచ్చింది.

వాళ్ళు సాఫ్ట్వేర్ ఇంజినీర్లుకాదు.డిఫరెన్స్ కోర్సులు డిఫరెంట్ డిగ్రీలుచదివి వేరే వేరే ఫీల్డ్ నుంచి వచ్చినవారూ.

అందరితో పరిచయాలు అయ్యాక మనం ఇలా తరచుగా కలుద్దాం అని అనుకున్నారు.

సరిగ్గా సంవత్సరం రేవతి అడిగిన గడువు పూర్తి అయ్యే టైముకి అరవింద నిర్ణయం తీసుకుంది.

తన జీవిత సహచరుని ఎన్నుకుంది.

అతను భార్గవ– రేవతి అనుకున్నవారు కావడం మీనాక్షి –సుందర్రావు గారూకూడా మెచ్చుకోవడం అరవిందకి బ్లెస్సింగ్స్ అయ్యాయి .

''డాడ్ మీకు ఓకేనా ?'' అని భార్గవను అడిగింది.

''మీ అందరి సంతోషమే నాకు ఆనందం!'' అన్నాడు భార్గవ.

''నా కూతురును నేనే సరిగ్గా అర్థం చేసుకోలేదు. ఈకాలం అమ్మాయి అనుకున్నాను. ఎవరో నచ్చినవాడిని తీసుకువచ్చి పెళ్లి నువ్వు చేస్తావా....నన్ను చేసుకోమంటావా ? అంటుందని అనుకుంటే నన్నే చూడమంది

నాకే అవకాశం ఇచ్చింద'' ని మనసారా అరవిందను, అందరూ మెచ్చిన అల్లుడు అభిమన్యుని దగ్గిరగా తీసుకుంది .

అరవింద ఇష్టప్రకారం సాంప్రదాయమూ కాదు ఇప్పటిలా ప్రీ వెడ్డింగ్ షూట్ ప్యాకేజి పదిరోజుల అతిగా పోయే అట్టహాసమూ కాదు ''ప్రమాణాలతో ఉంగరాలు పూలదండలు మార్చుకునే'' పెళ్లి చేసింది...రేవతి.

★★★

★★★

COMMENTS